
పిల్లలు పుట్టే
యోగం లేకపోయినా
తను గొడ్రాలుకాదని
ఆమె ఎలా
నిరూపించుకుంది?




# నేను గొడ్రాలిని కాను

"నో...నో...నేను గొడ్రాలిని కాను"

* * *

"నో...నో...నేను గొడ్రాలిని కాను" అంటూ ఒక్క ఉదుటన గావుకేక పెట్టింది విమల!

పక్కనే పడుకున్న విజయ్ ఉలిక్కిపడి అదిరిపాటుగ లేచి గభాల్న లైటు వేశాడు.

లైటుకాంతి కళ్ళమీద పడేసరికి విమలకు మెలకువ కల్గింది. ఆమె ముఖమంతా చెమట పట్టేసి ఉంది. పైన సీలింగ్ ఫ్యాను తిరుగుతున్నా ఆమె కెందుకలా చెమటలు పట్టాయో అర్థంకాలేదు విజయ్‌కు. ఆమె రొమ్ములు ఎగిరెగిరిపడుతున్నాయి.

"ఏమిటి విమ్మీ!... ఏమిటలా అరిచావు?" అన్నాడు విజయ్.

ఒక్కసారిగ లేచి కూర్చుని, విజయ్ కేసి ఓ పిచ్చిచూపు చూసి, ఒక్కసారి బావురుమంటూ అతని ఒళ్ళో పడిపోయింది.

"అరె! అసలేం జరిగింది విమ్మీ... ఏమన్నా పీడకలొచ్చిందా?"

"చెప్పండి... మీరన్నా చెప్పండి... నేను గొడ్రాలిని కానని...నో...నో నేను గొడ్రాలిని కాను..." అంటూ ఘోరున ఏడుపు మొదలుపెట్టింది.

"ఊర్కో! ఊర్కో! ముందు కాసిని మంచినీళ్లు త్రాగు..." అంటూ గ్లూకోజు కలిపిన నీళ్ళిచ్చి, ఆమె ముఖంమీది చెమట బిందువుల్ని తుడవసాగాడు

గ్లూకోజు నీళ్ళు తాగిన కొద్దిసేపటికి విమలకు కొంచెం దడ తగ్గింది. మామూలు మనిషయింది.



ఆ రోజు పాటి పూటే దో జరిగి ఉంటుందని ఊహించాడు విజయ్.

"అదికాదండీ! ఇవ్వాళ వరలక్ష్మమ్మ గారింట్లో-" అంటూ ఏదో చెప్పబోయింది.

"నో నో...యిప్పుడేం వద్దు...తెల్లారాక చెప్పుకుందాం ఏం?" అంటూ పడుకోబెట్టి లైటు తీసేసి ఆమెను దగ్గరగా పడుకున్నాడు పసిపిల్లను జోకొట్టినట్టు విజయ్ ఆమె వీపుమీద జోకొడుతూండే క్షణంలో నిద్రలోకి జారుకుంది విమల.

* * *

విజయ్ బ్యాంకు ఆఫీసరు. క్లరికల్ కేడర్‌లో చేరిన ఏడేళ్ళకే ఆఫీసరయ్యాడు. బ్యాంకులో ఉద్యోగం రాగానే తండ్రి ఎన్నెన్నో సంబంధాలు చూశాడు. వాటన్నిటినీ కాదని, కట్నం కానుకలతో నిమిత్తం లేకుండా అతి సామాన్య కుటుంబములోని పిల్ల విమలను చేసుకున్నాడు. అప్పట్లో విమల స్కూలుఫైనలు చదువుతూ మానేసింది.

అమాయకంగా, అతి సహజంగా స్వచ్ఛమైన పాలనురుగులాంటి ఆమెనవ్వే అతన్ని ఆకట్టుకుంది.

పెళ్ళికాక ముందే పరిచయముండడం, ప్రేమించుకున్నామని చెప్పుకోవడం—ఓ రాషర యువరోజుల్లో విజయ్ మాత్రం, పెళ్ళి చేసుకొన్న క్షణంనుంచే విమలను మనసారా ప్రేమించసాగాడు.

విమల అతని జీవిత భాగస్వామినిగ వచ్చినప్పటినుంచీ ఆమెను ఒక్క క్షణమైనా విడిచి ఉండలేనంతగా ప్రేమించాడు—అప్పుడప్పుడు ఎప్పుడైనా ఆమె పుట్టింటికి వెళ్ళి ఓ రెండు రోజులుండి వస్తానంటే, ఆ కొద్ది పాటి వియోగం భరించలేక విలవిల్లాడిపోయేటంత అనురాగం ఏర్పరుచుకున్నాడు.

విమల కూడ విజయ్‌ని అంతకన్నా ఎక్కువగానే ఆరాధించేది. వారిద్దరూ చిలకా గోరింకల్లా అన్యోన్యంగా ఉంటుంటే చూసి కళ్ళు కుట్టనివారు లేరు.

స్వంత యిల్లు కట్టుకున్నాడు. ఇంటిలో ఫర్నిచర్ అమర్చుకున్నారు. రేడియో, గ్యాస్‌స్టవ్, కుక్కర్, మిక్సీ వగైరాలు మామూలే. ఫ్రిజ్‌గాని, టీవీ గాని కొనాలనుకుంటున్నాడు. అన్నీ ఉన్నాయి. దేనికీ లోటులేదు

కాని...కాని...ఒక్కటే లోటు!

ఈ సంపదనంతా అనుభవించేందుకు, యింటిలో కలకల్లాడుతూ నట్టింట నడయాడే పిల్లా పాపా యింతవరకు వారికి కలగకపోవడమే!

విజయ్ యీ విషయంలో అంతగా పట్టించుకోవడంలేదు కాని విమల మాత్రం బాధపడిపోతుంది! పిల్లలులేని యిల్లు దేవుడు లేని గుళ్ళు ఒకటేనని ఆమె నమ్మకం.

పెళ్ళయేనాటికి విమలకు పదిహేనేళ్ళే! ఇప్పుడో ముప్పై దాటిపోయింది. ఇంత వరకు పిల్లలు కలగలేదు. అసలు తనకు పిల్లలు పుట్టరేమోనన్న శంక అప్పుడప్పుడు విమలను పట్టుకు పీకుతూండేది

మొన్న మొన్నటిదాక తన తల్లితో పోల్చుకుని సరి పెట్టుకుంది! విమల తల్లికి కూడ ముప్పై యేళ్ళు వచ్చేదాకా పిల్లలు పుట్టలేదు.

అలాగే తనకు ఆలస్యంగా గర్భమొస్తుందేమోనని సమాధానపర్చుకుంటోంది. కాని...కాని... ఆ రోజేం జరిగింది...

వరలక్ష్మమ్మగారి మనవరాల్ని ఉయ్యాల్లో వేస్తారంటే పేరంటానికి వెళ్ళింది. వరలక్ష్మమ్మ గారంటే తాసిల్దారుగారి భార్య. అందుకని పేరంటం పెద్దస్థాయిలో జరిగింది. అదిగో...ఆ పేరంటంలో...తనని చూసి చెవులు కొరుక్కున్నారు కొంతమంది!

"ఆ అమ్మాయా... మా వీధిలోనే... డాబా...బ్యాంకులో ఆఫీసరు—"

"అలాగా! ఎంతమంది పిల్లలు?"

"ఆ! పిల్లా పీచా...ఏమీలేదు...! ఎంత ఉంటే ఏం లాభం? ఒక్క నలుసన్నా లేకపోయాక!"

"అదేం పాపం!"

"అదే!- పాపమంటే... వట్టి గొడ్డుమోతు! పెళ్ళయి కాపరానికి వచ్చి పద్దెనిమిదేళ్ళవుతోంది. ఇంతవరకు కడుపు పండలేదు ఇంకేం కంటుంది?"

"పిల్లలొద్దనుకున్నారేమో!... బర్త్ కంట్రోలా—భర్త కంట్రోలా— అదేదో ఉందిగా... ఈ మధ్య జనం తెలివిమీరిపోతున్నారు... అయినా గవర్నమెంటు పిల్లల్ని కనొద్దు బాబూ అంటూ గోల చేస్తోందిగా—"

"ఆ!...అదేంకాదు... అసలావిడకు పిల్లలుపుట్టే యోగమేలేదు"

"అలాగా!"

"ఆ!...అసలు అలాటి గొడ్రాళ్ళను యిలాంటి పేరంటానికి పిలవకూడదు... పసిపిల్లలకు దిష్టి తగులుతుంది వాళ్ళ కళ్ళు పడడం పిల్లలకు అంతమంచిది కాదు".

ఇలా ఓ మూల సాగిపోతున్న ఇద్దరు వృద్ధ ముత్తయిదువుల సంభాషణ తన గురించేనన్న విషయం తెలియడానికి విమల కాట్టే సేపు పట్టలేదు. అంతే... అమాంతం దుఃఖం పొంగుకొచ్చేసింది. వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక పేరంటం



ప్రారంభం కాగానే తెచ్చిన ప్రజెంటేషను యిచ్చేసి— గబగబ యింటికి వచ్చేసి— మంచంమీదపడి భోరున ఏడ్చేసింది.

అయిదారోజులనుంచి ఆ విషయాన్ని మర్చిపోదామన్నా—మర్చిపోలేకుండావుంది. ఎప్పటికప్పుడు విజయ్‌కు ఈ సంఘటన చెప్పాలనుకుండగాని చెప్పలేకపోయింది. పిల్లల విషయంలో విజయ్ తరహాయే వేరు. పిల్లలు ఉంటే మంచిదే కాని, లేరని మాత్రం బాధపడకూడదంటాడు

"ఏమండీ!"

"ఎందుకు విమ్మీ!... అంత బాధపడతావు!... మనకిప్పుడు పిల్లలు లేకపోతే యేం? ఎప్పటికీ నాకు నువ్వు. నీకు నేను పిల్లలమేగా!"

"అదికాదండీ!... ఆడది తల్లి కావాలని ఎంత తహతహలాడుతుందో మీకేం తెలుసు? మాతృత్వం వాంఛించని ఆడది ఎక్కడా ఉండదండి!"

"ఆల్‌రైట్!...ఓసారి డాక్టర్ దగ్గరకుపోయి యిద్దరం మెడికల్ చెకప్ చేయించుకుందాం!...ఓకే! ఊరికే అనవసరంగా వర్రీ అవకు విమ్మీ!..." అంటూ బుజ్జగించేవాడు విజయ్

విజయ్ ఎంత ఊరడించినా, విమల కానాటి సంఘటన పురుగులా పదే పదే మనస్సును దొలిచేయసాగింది!— దాని ఫలితమే అర్ధరాత్రి అలా ఒక్కసారి పెద్ద పెట్టిన గావుకేక!

* * *

నిర్మలానంద్ నర్సింగ్ హోమ్ దగ్గర స్కూటరాపాడు విజయ్ ఆ రోజు ఆదివారం కావడంచేత రెగ్యులర్ పేషెంట్సు ఎవ్వరూ లేరు. నిర్మల, ఆనంద్ యిద్దరూ భార్యాభర్తలు ఆ ఊళ్లో పేరు పొందిన డాక్టర్లు! అతి స్వల్పకాలంలోనే ప్రాక్టీసులో అందర్నీ తలదన్నారు. విజయ్ ఆనంద్ బాల్యమిత్రులు.

విజయ్, విమల సరాసరి డాక్టర్ ప్రైవేటు రూములోకె వెళ్ళారు.

"హాలో విజయ్!... కమాన్... కమాన్..." అంటూ ఆహ్వానించాడు ఆనంద్

"నమస్తే!" అంది విమల అప్పుడే రూములోకి వస్తున్న నిర్మలను చూసి.

నిర్మల ప్రతి నమస్కారం చేసి చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నట్లు కుర్చీ చూపించి కూర్చోమంది.

విజయ్ కూడ విష్‌చేసి కూర్చున్నాడు. క్షణంసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా మౌనం వహించారు

సంభాషణ ఎలా ప్రారంభించాలో ఎవ్వరికీ అర్థం కావడంలేదు

"విజయ్!... ఒక్కసారిలా రా!..." —అంటూ ఆనంద్ విజయ్‌ని ప్రక్క రూములోకి తీసికెళ్ళాడు.

"చెకప్ రిజల్ట్స్..." అనబోయింది విమల ఆతృత ఆగక!

"ఆ...అదే! అన్ని టెస్టుల రిజల్ట్సు వచ్చేశాయి. ఆనంద్ ఫైనలైజ్ చేస్తున్నారు... నువ్వనవసరంగా వర్రీ అవుతున్నావు విమలా!..." -అంది నిర్మల నవ్వుతూ!

"అది కాదండీ!..." అంటూ ఏదో చెప్పబోయిన విమలను మరో టాపిక్‌లోకి మార్చేసింది నిర్మల!

ఈలోగా ప్రక్క గదిలో సంభాషణ యిలా సాగుతోంది!

"యువార్ క్వైట్ ఆల్ రైట్ విజయ్!... కాని... కాని...కెనాట్ కన్సీవ్! She cannot conceive! ప్రాక్టికల్లీ దేరీజ్ నో ఛాన్స్ ఆఫ్ హర్ బికమింగ్ ప్రెగ్నంట్! There is no chance of her becoming pregnant...." అన్నాడు బాధగ ఆనంద్!

"వ్హాట్!...ఈజిట్ ట్రూ?"...ఆందోళనగా అడిగాడు విజయ్!

"ట్రూ!... యాజ్ ఫార్ యాజ్ మై ఎక్స్పీరియన్స్ గైడ్స్ మి...నిర్మల కూడ యిదే కంక్లూజన్‌కు వచ్చింది..."

"ఆల్‌రైట్!"—అంటూ ఒక్కసారి బాధగ నిట్టూర్చాడు విజయ్! క్షణం సేపు నిశ్శబ్దం రాజ్యమేలింది ఆ గదిలో!

"ఒక్క హెల్ప్ చెయ్యాలి ఆనంద్!... ఈ విషయం విమలకేమాత్రం తెలియనివ్వద్దు!... ఆమెకి సంగతి తెలిస్తే అప్‌సెట్ అయిపోతుంది! ... ఆ పైన ఆమెకేమైనా జరిగితే నేను భరించలేను... అసలు ఆమె లేకపోతే నేను బతకలేను. ప్లీజ్..." -అంటూ ఆనంద్ చేతులు పుచ్చుకున్నాడు విజయ్!

"ఆల్‌రైట్!... అలాగే!... నీ యిష్ట ప్రకారమే..." అంటూ ఆ యిద్దరూ ఏం జరగనట్లు నవ్వుకుంటూ బయటికొచ్చారు.

"ఈ టానిక్ డైలీ త్రీ టైమ్స్ వాడండి! ఈ కాప్స్యూల్స్ ఒక్కొక్కటి చొప్పున వేసికోవాలి! యాఫ్టర్ మీల్స్!..." -అంటూ ఆనంద్ ప్రిస్క్రిప్షను రాసిచ్చాడు.

స్కూటరెక్కినప్పటి నుంచి అడగాలనే ఉంది విమలకు! కాని రన్నింగ్‌లో వినపడదని ఆగిపోయింది! అయినా ఆతృత ఆగటంలేదు.

"డాక్టర్ ఆనంద్ ఏమన్నారండీ!..." అంది భర్త నడుంచుట్టూ రెండుచేతుల్నీ గట్టిగా పెనవేసుకుంటూ!

"మరేం వర్రీ లేదన్నాడు విమ్మీ!... జనరల్ వీక్‌నెస్ అనీ...ఏవో కొన్ని హార్మోన్స్ తక్కువగా ఉన్నాయనీ-అందుకని-మందులు రాసిచ్చాడుగా!. ఈ కోర్సు కంప్లీటు కాగానే..." మళ్ళీ చెకప్ చేస్తానన్నారు కదూ!"

## డాక్టరు మేనేజరు




"అదేవిటోయ్ కామేశ్వర్రావ్. మీ ఆఫీసుకి మేనేజరుగా డాక్టరే కావాలని ప్రకటించారు. ఎందుకని?" అడిగాడు రంగనాథం.

"మా వాళ్ళంతా జబ్బని, దగ్గని మాటి మాటికి దొంగ సెలవులు పెడుతున్నారు అందుకని" చెప్పాడు కామేశ్వరరావు.

—మంత్రాల (శ్రీకాకుళం)

"ఎస్...ఎస్... కరెక్ట్!... ఈసారి చెకప్‌లో..."

ఇంతలో స్కూటరు యింటిదగ్గర ఆగింది. స్కూటర్ దిగగానే విమల గబగబా యింట్లోకి వెళ్ళిపోయింది స్కూటర్‌ని వరండాలో పార్కు చేసి లోపలికొచ్చాడు విజయ్!

విమల ఈజీ ఛైర్‌లో దిగులుగా కూర్చుంది!- ఆమె కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఈసారి చెకప్‌లో..." అంది రుద్ధ కంఠంతో!

"అవును విమ్మీ!... ఈసారి చెకప్‌కి బెటర్ రిజల్ట్స్ వస్తాయన్నాడు-" అంటూ ఆమెను ఉత్సాహ పర్చాలన్న ధోరణిలో సంతోషంగా చెప్పాడు!

"ఎందుకండీ!.... అలా అబద్ధాలాడి నన్ను మభ్యపెడతారు!- డాక్టర్ అనందే మన్నారో నేను చెప్పనా!..." అంది, పూడిపోతున్న కంఠంతో!

"నిజం విమ్మీ!...నామాట నమ్ము!.."

"లేదండీ!...నేను గర్భం దాల్చే అవకాశం ఎమ్మాత్రం లేదన్నారు .అవునా!...."
-అంటూ నిలదీసి అడిగింది!

"విమ్మీ!..." అంటూ భయంగాను, ఆందోళనగా అరిచాడు.

"కోప్పడకండి!.. నాకంతగా యింగ్లీషు రాకపోయినా ఆయనన్న రెండు మాటలు వినబడ్డాయి నో ఛాన్స్- ప్రెగ్నెంటు- అండీ..."

"అది కాదు విమ్మీ!...అది...అది" అంటూ యింకా ఏమో చెప్పబోయాడు విజయ్!

ఈలోగా విమల కుర్చీలోంచి లేచి బెడ్‌రూం లోకి పోయి మంచంమీద పడి ఏడ్వసాగింది.

ఏంచేయాలో తోచని విజయ్ ఆమెనలా కొంచెంసేపు విశ్రాంతిగ వదిలేయడం మంచిదని భావించాడు.

* * *

"విమ్మీ!... నా మాట విను... పిల్లలంటే నీకంత ముచ్చటగా ఉంటే...పోనీ ఎవర్నన్నా పెంచుకుందామన్నానుగా!...

"అది కాదండీ!..."

"ఏది కాదు!... నువ్విలా తిండికూడ సరిగ్గా తినకుండా నీరసించి పోతుంటే... నాకెంత బాధగా ఉందో తెలుసా!...నువ్వు ఊ అను... రేపీపాటికి నీకు నచ్చిన పిల్లనో, పిల్లాడినో ఏ అనాధ శరణాలయం నుంచో తెచ్చుకుందాం."

"ఆ పిల్లలు మన పిల్లలెలా అవుతారండీ?"

"అంటే... మన పిల్లలంటే... నీ ఉద్దేశం?..."

"అవునండీ!...మన రక్తం పంచుకుని పుట్టిన పిల్లలు...మీ రక్తము, నా రక్తము పంచుకుని పుట్టిన పిల్లలు...."

"విమ్మీ!...అన్నీ తెలిసికూడ అలా మంకుపట్టు పడితే యెలా?...డాక్టరుగారి రిపోర్టు నీకు తెలుసుగా!... ఇంక అదెలా సాధ్యమవుతుంది?... అందుకని యిక ఆ విషయం మర్చిపోవాలి?..."

"అందుకేనండి!... మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే... నా రక్తం పంచుకోకపోయినా పర్వాలేదు...కనీసం మీ రక్తం పంచుకుని పుట్టిన బిడ్డయినా చాలు...

ఆడే వేను కోరేది..."

"విమ్మీ!... ఏమిటి నువ్వనేది?..." కొంచెం తీవ్రంగానే అన్నాడు.

"కోప్పడకండి!... మాతృత్వం పొందాలని ఆడదెంత తపించిపోతుందో మీకర్థం గాదు... ఏ జన్మలో చేసికొన్న పాపమో నాకు యీజన్మలో దైవం యిలా శిక్ష విధించాడు...నాకెలాగూ మాతృత్వ యోగం లేదు...అందుకని మీరు మరో పెళ్ళి..."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్! నీకేమైనా పిచ్చిపట్టిందా? మతిభ్రమిస్తోందా?"...కోపంగా అరిచాడు...

"అవునండీ!... ఇంకా కొన్నాళ్ళిలా పోతే పిచ్చేపట్టుంది!...మతే భ్రమిస్తుంది. నాకు బిడ్డలు కావాలి!...నేను గొడ్రాలిని కాను... నో...నో... నేను గొడ్రాలిని కాను..." అంటూ విరుచుకు పడిపోయింది విమల!

విజయ్ కొయ్యబారి పోయాడు... విమల ప్రక్కనే కూర్చుని వీపు నిమర సాగాడు.

* * *

"మా బాబాయండీ!"...అంటూ పరిచయం చేసింది విజయ్‌కు ఓ సాయంత్రం యింటికి రాగానే పరంధామయ్యను.

"ఓ! అలాగా నమస్కారమండీ!..." అన్నాడు విజయ్!

"మంచిది నాయనా!" అన్నాడాయన!

"కూర్చోండి! బట్టలు మార్చుకొస్తాను..." —అంటూ లోపలికెళ్ళాడు.

క్షణంలో విజయ్ డ్రస్ మార్చుకొని వచ్చి కూర్చున్నాడు. ఈలోగా విమల రెండు కప్పులతో కాఫీ తీసికొచ్చింది!

"అమ్మాయి అన్నీ చెప్పింది నాయనా! నేనా పెద్ద వాణ్ణయిపోయాను. బడిపంతులుగా నేను సంపాదించిందేం లేకపోయినా ఆరుగురు ఆడపిల్లలను మాత్రం కన్నాను

---



## నిరుద్యోగభృతి

నిరుద్యోగభృతి కావాలని ... నిరుద్యోగులంతా అడుగుతున్నారు. వారి కోరికను అస్సాం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం అక్టోబర్ మొదటి తేదీనుండి తీర్చడానికి ఒప్పుకొంది. అస్సాంకు చెందిన నిరుద్యోగ పట్టభద్రులంతా తమకు ముప్పై ఏళ్ళ వయసునిండే వరకూ...నెలకు యాభై రూపాయల్ని పొందుతారు. అంతేకాదు! తమ రాష్ట్రంలో 65సంవత్సరాలు దాటిన మగవారికీ, అరవై సంవత్సరాలు నిండిన ఆడవారికీ...మరే ఇతర ఆదాయం లేకపోతే నెలకు అరవై రూపాయల్ని చెల్లించడానికికూడా అస్సాం ప్రభుత్వం నిశ్చయించింది. మరి ఈ ముచ్చట ఎన్నాళ్ళుంటుందో వేచిచూద్దాం!

—జూపిటర్

పెద్దవాళ్ళిద్దరికీ ఏదో తగ్గ సంబంధాలే చేసి చేతులు దులుపుకున్నాను. ఇంక మూడోదే యిప్పుడు అమ్మాయి చెప్పేది..." -అంటూ ఆయనేదో చెప్పుకుపోతున్నాడు.

విజయ్‌కేం అర్థం కావటంలేదు...

"మా బాబాయి కూతుళ్ళందరిలోకి యీ మూడోదే బాగుంటుందండీ -నాకన్నా ఏడెనిమిదేళ్ళు చిన్నదేమో! -అయితే యేం చక్కగా సంసారం దిద్దుకోగలదు..." అంటూ సిఫార్సు చేసోంది విమల.

ఈ మాటలెందుకంటోందో అసలర్థం కావటం లేదు విజయ్‌కు!

"అమ్మాయి రాసేదాక నీకా తలంపు ఉన్నట్టుకూడ మాకు తెలీదు నాయనా!... అంతకంటే మాక్కావల్సిందేముంది?... అక్కా చెల్లెళ్ళు!- ఒకే యింట్లో కలిసి మెలిసి ఉంటారు..."

విజయ్ తల తిరిగి పోతోంది! అంతా అయోమయంగా ఉంది!

"మీరు చెప్పేదేమిటో నాకేం అర్థం గావటంలేదు. ఇంతకూ మీరుచెప్పేది..."

"ఏంలేదు నాయనా!-అమ్మాయి విమల కోరికమీద మా అమ్మాయిని నీకిద్దామని..."

"స్టాపిట్... ఏమిటి మీరు మాట్లాడేది?..." అంటూ అరిచాడు!

ఆ పెద్దమనిషి తెల్లబోయాడు భయం భయంగా చూడసాగాడు విమల బిక్క మొహం పెట్టేసింది! -ఇక భోరున ఏడవడమే తరువాయి! పరిస్థితి అప్పటికి అర్థమయింది విజయ్‌కి! కొంచెం తమాయించుకున్నాడు!

"చూడండి! -మీరేమిటో..."

"పరంధామయ్య బాబూ!"

"పరంధామయ్యగారూ! మా విమల తెలిసో తెలియకో మీకు రాసుంటుంది అదీంకా చిన్నపిల్లే! ఏదో పిల్లలు పుట్టనంత మాత్రాన నేను మరో పెళ్ళిచేసికొని ఆమెకు ద్రోహం చేయలేను"

"ఇదంతా అమ్మాయి యిష్టమే నాయనా!"

"చూడండి! విమలకింకా లోకజ్ఞానం తెలియకపోవచ్చును మిమ్మల్ని యిబ్బంది పెట్టినందుకు మన్నించండి! మీ అమ్మాయికి మంచి సంబంధం కోసం నేను కూడ ప్రయత్నిస్తాను"

"వస్తాన్నాయనా" అంటూ మళ్ళీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడాయన.

ఆయనలా గుమ్మందాటాడోలేదో విమల ఒక్కసారి భోరుమని ఏడ్చేసింది.

"విమ్మీ!...ఇక యిలాంటి పిచ్చిపన్లు చేయనని నువ్వు ప్రామిస్ చేయాలి! నీకు తప్ప యింకొకరెవ్వరికీ యిక్కడ చోటు లేదు... నిన్నుకాదని నేను బ్రతకలేను విమ్మీ! నువ్వు తప్ప నాకు వేరే లోకం లేదు... నువ్వు తప్ప నాకింకెవ్వరూ అక్కర్లేదు... ఏదీ?... చేతిలో చెయ్యి వెయ్యి ఇక మళ్ళీ పెళ్ళిసంగతి ఎత్తనని"

"ఏమండీ!... నన్ను క్షమించరూ!" అంటూ విజయ్ కాళ్ళను చుట్టేసింది.

రెండు చేతుల్తో ఆమెను లేవనెత్తి మెల్లిగా యింట్లోకి తీసికెళ్ళాడు విజయ్!

* * *

"నువ్వు చెప్పేదెలా సాధ్యమవుతుందమ్మా?" అంది డాక్టర్ నిర్మల!

"అదీగాకో విజయ్ మరో పెళ్ళికి ఒప్పుకోనప్పుడు నువ్వు చెప్పేది అసంభవ

మమ్మా!" అన్నాడు డాక్టర్ ఆనంద్!

"మీరేంచేసినా సరే! పిల్లలు కావాలన్న నాకోరిక తీరకుండా నేను మాత్రం చచ్చిపోకూడదండీ!" అంది గద్గదస్వరంతో విమల!


"నీకోరిక బాగానే ఉందమ్మా! విజయ్ కూడ నిన్న సాయంత్రం ఈ సంగతే చెప్పాడు...." అన్నాడు ఆనంద్!

"అందుకనే ఆయనకు తెలియకుండా యివాళ మీదగ్గరకొచ్చాను. ఆయన్నెలాగైనా ఒప్పించాలి! మీరే చెప్పండి: ఎవరి రకమో పంచుకుని పుట్టిన బిడ్డను పెంచుకుంటే నా మాతృత్వవాంఛ తీరుతుందా! నా రక్తం కాకపోయినా కనీసం ఆయన రక్తం పంచుకునన్నా పుట్టే నాకు చాలు..." అంది విమల!

డాక్టర్లిద్దరికీ యిదొక పెద్ద పజిల్‌లా తయారయింది. దీన్ని ఎలా సాల్వ్ చేయాలో అర్థంకావడంలేదు మరో పెళ్ళికి ఒప్పుకోని విజయ్ మరో స్త్రీతో సంపర్కానికి అంగీకరిస్తాడా? ఒకవేళ అతనంగీకరించినా ఏ స్త్రీ అందుకు ఒప్పుకుంటుంది? సంసారం చేసుకొంటున్న స్త్రీలెవ్వరూ అందుకు యిష్టపడరు... ఇక పోతే- ఛా! పాడు ఆలోచన అనుకుంటున్నాడు ఆనంద్!

"నువ్వనవసరంగా బుర్రపాడుచేసికొని నీ ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నావమ్మా! నీకోరిక తీరడం అంత తేలికైనది కాదు. మనకు కొన్ని సాంఘిక కట్టుబాట్లున్నాయి. వాటిని అధిగమించి మనం ముందుకు పోలేము. అయినా విజయ్ విషయంలో మరోసారి సంప్రదించి పెళ్ళికంగీకరించేలా చేస్తాం! ఏమంటావు?" అంది నిర్మల!

"అది జరిగేపని కాదండీ! ఆయనకు నామీద తప్ప మరి ఏ స్త్రీమీదకు మనసు



పోదు. నేనంటే ఆయనకంత పిచ్చి ప్రేమ అభిమానం ... నేను లేకపోతే ఆయన బ్రతకలేడేమో !" అంది విమల !

"ఆల్ రైట్ ఇక నువ్వెళ్ళమ్మా !... మమ్మల్ని కాస్త ఆలోచించుకోనీయ్ !" అన్నాడు డాక్టర్ ఆనంద్.

"నేను వచ్చివెళ్ళినట్లు ఆయనకు తెలియనివ్వకండేం! ప్లీజ్!" అంది విమల!

"ఓ...కే" అంటూ నవ్వుకున్నారు డాక్టరిద్దరూ !

* * *

"ఏమిటే !... నల్గురితోనూ సరదాగా, సోషల్‌గా మూవ్ అవుతూ ఉద్యోగంచేస్తున్నంతమాత్రాన నేనేమన్నా బజారుమనిషి ననుకున్నావా ?" కోపంతో ఊగిపోతూ తీవ్రంగా అడిగింది సుజాత ! విమల చిన్ననాటి స్నేహితురాలు !

"అదికాదు సుజీ! నాకలాంటి దురభిప్రాయం ఎప్పుడూలేదు.... నాకున్నదల్లా ఒక్కటే కోరిక! లోకంలో ఎవ్వరూకూడ నన్ను గొడ్రాలని వేలెత్తి చూపకుండా ఉండాలి. అదొక్కటే నాకోరిక ?" అంది విమల

"అదెలా సాధ్యం ? నీకు గర్భం దాల్చే అవకాశమే లేదని డాక్టర్లు చెప్పారన్నావుగా !"

"అవును సుజీ !... ఆయనలో ఏ లోపంలేదట... నా దురదృష్టం! నేను గర్భవతినయ్యే అవకాశం మాత్రం లేదని స్పష్టంగా చెప్పారు. అందుకే నిన్ను—" ఆగిపోయింది విమల!

"అందుకని ఆయనద్వారా బిడ్డకలగడానికి నేను సాధనంగా ఉండాలా! ఎంత దౌర్భాగ్యపు కోరిక ! విమలా ! నువ్వూ నేనూ చిన్నప్పటినుంచి ఒకటిలా పెరిగిన స్నేహితులం కాబట్టి యీ మాటలన్నందుకు క్షమించి ఊరుకోగల్గుతున్నాను. ఇదే మరొకళ్ళయితే యీపాటికి" అంటూ కోపంతో పళ్ళు పటపటలాడించింది.

"నన్ను క్షమించు సుజీ. నా బాధనర్థం చేసుకొంటావనే నీదగ్గరకొచ్చాను... అంతే కాని నిన్ను నైతికంగా పతనం చేయాలని మాత్రంకాదు... అదేగా డాక్టర్లు చెప్పబట్టి వారిచ్చిన సలహాతోనే నిన్ను బ్రతిమాలుకుంటున్నాను... చేతులెత్తి ప్రార్థిస్తున్నాను..."

"ఏమిటా డాక్టర్లిచ్చిన సలహా ?... ఒక రాత్రికి మీ ఆయనతో"

"సుజీ! ఆగు! నువ్వేమీ ఆయనతో సంపర్కం పెట్టుకోనక్కర్లేదుట. కేవలం గర్భోత్పత్తికి అవసరమైన అండాన్ని గ్రహించడానికి నువ్వంగీకరిస్తే చాలుట.." అంటూ ఆగింది !

"అదేమిటి ?— నాకేం అర్థంకావటం లేదే ?" అంది సుజాత !

"అవును సుజీ! ఆయన వీర్యాన్ని తీసికొని, నీవు ప్రసాదించే అండానికి జోడుచేసి, అయిదురోజుల తర్వాత, కృత్రిమ సంపర్కం ద్వారా ప్రాణంపోసుకొన్న ఆ పిండాన్ని నా గర్భసంచిలోకి ప్రవేశపెట్టారట... అండాల్ని విడుదల చేసే శక్తి నాకు లేదు కాని... గర్భసంచిలోకి ప్రవేశించే ఆ సంయోగపిండాన్ని పెంచి పోషించేందుకు అవయవాలన్నీ అనువుగానే ఉన్నాయట...."

"చాల విచిత్రంగా ఉందే !"

"అవును... కేవలం బలీయమైన మాతృత్వవాంఛతోనే యింతటి సాహసానికి ఒడిగట్టి, అనవసరంగ నీ మనసు నొప్పించాను మాతృత్వంలోని తీయదనం గొప్పదనం నీకు తెలియనిదికాదు... వస్తా నేను చేసిన యీ పొరపాటుకు నన్ను మనసారా మన్నించానని చెప్పు! ఈ జీవితానికి నాగతి యింతే ననుకుంటాను..." అంటూ గుడ్లనీరుకక్కుకుంటూ వెళ్ళిపోయింది

"విమలా!... విమలా!!..." అంటూ పిలుస్తున్న సుజాత పిలుపు విమలకు వినబడ్డా ఆమె వెనుదిరగలేదు

ఆ రాత్రి సుజాతకు నిద్రపట్టలేదు... తల్లి కావడానికి ఆడదెంత తపనచెందుతుందో తనకి తెలియనిదికాదు... పాపం! ఎలా ఉండే విమల ఎలా తయారయిపోయింది! ఎందులోనూ లోటులేదనుకున్న విమల గుండెల్లో యింత గుబులు గూడుకట్టుకొని ఉందన్నమాట అందుకే మానసికంగా కృంగిపోతోంది! విమల చెప్పింది యదార్థమేనా! డాక్టర్లు చెప్పింది నిజమవుతుందా? రక్తదానం చేయడం విన్నది. నేత్రదానం చేయడం విన్నది. మూత్రపిండం దానం చేయడమూ వింది. అవన్నీ కళ్ళారా చూడకపోయినా అన్నీ యదార్థాలే. వాటివల్ల ఎంతమందో రోగులు ప్రాణాపాయం నుంచి బ్రతికిబయటపడ్డారు మరి యిప్పుడు విమలచెప్పేదేమిటి? ఆమె భర్తవీర్యానికి అనువైన అండాన్ని తాను అందివ్వడానికి అంగీకరించాలా! అంటే యిదొక క్రొత్తదానమన్నమాట... అండదానం. అంటే యిందులో నైతికంగా దోషమేమీ ఉండదా! అలాచేస్తే విమల కోరిక నెరవేరి మానసికంగా మళ్ళా మరో జన్మనెత్తుతుందా?

* * *

"సక్సెస్! గ్రాండ్ సక్సెస్! మిస్టర్ విజయ్ వి ఝ్యాజ్ ప్రెగ్నెంట్" అంటూ ఆనందాతిశయంతో రూములోంచి బయటికొస్తూ అన్నాడు ఆనంద్!

అతని వెనకాలే నిర్మల వాష్‌బేసిన్‌లో చేతులు శుభ్రం చేసికొంటూ "విమల చిరకాలవాంఛ నెరవేరబోతోంది మిస్టర్ విజయ్ నౌ షి యీజ్ కారీయింగ్" అంది

"రియల్లీ!... థాంక్స్!" అంటూ డాక్టర్ రెండు చేతుల్నీ పట్టుకుంటూ ఆనందపడిపోసాగాడు విజయ్!

"థాంక్స్ చెప్పాల్సింది మాక్కాదు విజయ్ ఆ అర్హత, అదృష్టం దక్కాల్సింది సుజాతకు! మా ఊహాశిల్పానికి రూపకల్పన చేయడంలో సాహసంగా ముందుకొచ్చి సహకరించిన సుజాతకే ఈ క్రెడిటంతా దక్కుతుంది" అంది డాక్టర్ నిర్మల!

అప్పుడే రూములోంచి వస్తున్న విమల ముఖంలో అనంతమైన తృప్తి, ఆనిర్వచనీయమైన ఆనందం, అణుకోలేని గర్వం అన్నీ తొణికిసలాడ్డం అందరికీ స్పష్టంగా కనపడింది.

* * *

పదినెలల తర్వాత ప డంగ పాపాయిని ఉయ్యాలలోవేసే కార్యక్రమానికి ఊరందర్నీ పేరంటానికి పిలిచింది విమల

"చూశారా! నేను గొడ్రాలిని కాను..." అన్నట్లుగా పేరంటానికి వస్తున్న ముత్తయిదువులందరికేసి విజయగర్వంతో చూస్తూ ఆహ్వానిస్తోంది

"హేట్సాఫ్ టు మెడికల్ సైన్సెస్— త్రీ ఛీర్స్ టు సైంటిఫిక్ డెవలప్‌మెంట్" అనుకున్నాడు విజయ్ మనసులో! ✱